మారుమూల పల్లెలో పుట్టి పెరిగిన సుశీలకి ఆ వూరు వింత ప్రపంచంలా అద్భుతంగా కనబడింది. తనకు రానున్న అపద తెలుసుకోలేక అక్కడ వుండటం తన పూర్వజన్మ సుకృతంగా భావించింది.

తన అదృష్టానికి పొంగిపోయాడు వీర్రాజు. జున్ను ముక్కలాటి పడుచు చేతికి అందుబాటులో వుంది. సమయం కోసం వేచి వున్నాడు.



వచ్చిన వారంలోనే సుబ్బారావు కాంపు పని మీద పొరుగూరు వెళ్ళాడు.

వూరంతా బలాదూరు తిరిగి రాత్రికి యింటికి చేరాడు వీర్రాజు. తను పొందబోయే సుఖాన్ని తలుచుకుంటూ గుటకలు మింగుతున్నాడు. గేటు తీసుకుని కాంపౌండులోకి అడుగు పెట్టేసరికి కెవ్వుమన్న కేకతో ఒక్క పరుగున బయటకి వచ్చింది సుశీల. ఎదురుగా వున్న వీర్రాజుని కావలించుకుని "అన్నయ్యా! వాడు చూడు. నన్నల్లరి పెడుతున్నాడు." అంది గడగడ వణికిపోతూ.

ఆ సంబోధన అతని మనసుని తాకి వింత అనుభూతిని కలిగించింది. అతనిలోని మరో మనిషి మేల్కొన్నాడు. "ఎవడ్రాడు! దొంగనా కొడుకు! నా చెల్లెమ్మమీద చెయ్యేస్తావురా!" అని బూతులు తిడుతూ ఎడాపెడా కుమ్మేశాడు వాడిని. "మళ్ళీ ఎప్పుడైనా నా చెల్లెమ్మని కన్నెత్తి చూశావో, గొయ్యితీసి పాతేస్తాను. జాగ్రత్త" విసురుగా బయటకి తోశాడు ఆ కుర్రాడిని. యిదే సందని పరుగు లంకించుకున్నాడు ఆ కుర్రాడు.

భయంతో వణికిపోతూ గోడకి కరుచుకు పోయింది సుశీల. "అన్నయ్యా! సమయానికి నువ్వొచ్చావు. లేకపోతే నేనేమైపోయేదాన్నో." అని బావురుమంది.

"వూరుకోమ్మా! వూరుకో. నేనున్నాగా, నీకేం భయంలేదు. అంతగా అయితే బావొచ్చిం దాకా అమ్మ నీకు తోడు పడుకుంటుందిలే." అన్నాడు లాలించుతున్నట్లు.

ఆ గల్లంతుకు బయటకి వచ్చిన అన్ని వాటాల వాళ్ళు అనుకోని సంఘటనకి 'ఆశ్చర్యంగా చూశారు. 'కలా! నిజమా!' అన్నట్లు.

—సరస్వతి

## ముష్టి

గుడిలోనుంచి బయటకు వచ్చింది వర్ధనమ్మ. మెట్ల ప్రక్కగా కూర్చుని వున్నారు బిక్షగాళ్ళు అనేకమంది. తమ చేతులలో వున్న గిన్నెలను ముందుకు చాచి "తల్లీ ధర్మం" అంటూ యాచిస్తున్నారు.

కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు, పసిపిల్లలు పండు ముసలివాళ్ళు అనేకమంది దరిద్రానికి వారసుల్లాగా కూర్చొని వున్నారు. వాళ్ళందరినీ చూస్తుంటే చెప్పలేని అసహ్యమూ, ఏవగింపు, కోపం కలిగాయి వర్ధనమ్మకు.

ఒక్కరికి కూడా ఒక్క పైసా ధర్మం చేయటం యిష్టం లేదామెకి.

"ముష్టి వెధవలు" అని మనస్సులో అను కొని వాళ్ళ ముఖం చూడడమే పాపం అన్నట్లుగా సాగిపోయింది ఆమె.

మెట్లచివరగా కూర్చొన్న రెండు కాళ్ళులేని ముసలివాడు "తల్లీ! రెండు కాళ్ళులేని ముని లోణ్ణి. దయతలచి పది పైసలు ధర్మం చేసి పుణ్యం కట్టుకోమ్మా" అని గిన్నెను ముందుకు చాచి ఆమె కాళ్ళకు దణ్ణం పెట్టబోయాడు.

తన కాళ్ళను తాకబోతున్న వాడి చేతులను చూసి పాముని చూసినట్టుగా భయపడింది వర్ధనమ్మ.



"యూ డర్టీ బెగ్గర్" అని వాడిని తిట్టి గబగబా మెట్లు దిగింది.

'అసలీ ముష్టి వెధవలనందరినీ కాల్చిపారేస్తే తప్ప యీ దేశం బాగుపడదు. ఎక్కడ పడితే అక్కడ తయారు వీళ్ళు' అని తిట్టుకుంది మనస్సులో.

"రిక్షా కావాలా అమ్మా" వర్ధనమ్మను చూస్తూనే అడిగాడు ఒక రిక్షావాడు.

"గాంధీ బొమ్మ దగ్గరికి ఏం తీసుకుంటావు?" అనడిగింది.

"మీకు తెలియనిదేటుందమ్మగారూ! రూపా యిప్పించండి" చెప్పాడు.

"రూపాయా? ఏమంత దూరముందని రూపాయి అడుగుతున్నావు? ముప్పావలా యిస్తాను" అన్నది.

"లేదండమ్మగారూ! కష్టం గమనించండి" ప్రాధేయపడ్డాడు రిక్షావాడు.

"తొంభై పైసలిస్తాను. వస్తేరా లేదంటే వెళ్ళు" నిక్కచ్చిగా చెప్పింది.

"సరే రండి" అని వాడు అనగానే రిక్షా ఎక్కి కూర్చొంది వర్ధనమ్మ.

గాంధీ బొమ్మ దగ్గర రిక్షా దిగి రూపాయి కాగితం వాడి చేతికిచ్చింది.

"దయ తలచండమ్మగారూ!" రూపాయి వుంచుకుంటానన్నట్టుగా ప్రాధేయపడ్డాడు.

"అదేం కుదరదు – పది పైసలివ్వు" దబా యించింది. "ముష్టాడి కేశాననుకుంటాను. ఉంచు కోండమ్మా" అని జేబులోనుంచి పది పైసలు తీసి వర్ధనమ్మ చేతిలో పడేశాడు రిక్షావాడు.

—పి. పుణ్యవతి

## మనసులోని మనసు

వరండాలో కూర్చుని వారపత్రిక చదువుతున్న నేను గేటు తీస్తున్న చప్పుడికి తల ఎత్తి చూసాను. ఎవరో ఒక అపరిచిత యువకుడు వస్తున్నాడు. నేను వెంటనే లేచి నిలబడి, "ఎవరు కావా లండి?" అని అడిగాను. "గది అద్దెకిస్తారని తెలిసి వచ్చానండి" అన్నాడతను. అతన్ని తీసుకెళ్ళి గది చూపాను. అద్దెంతో చెప్పాను. అన్నిటికి అతను తల సాంతం ఎత్తకుండానే తల ఊపుతున్నాడు. చాలా అమాయకుడిలా ఉన్నాడే పాపం అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయాను.

*

రమణ గదిలోచేరి నెల దాటింది. ఈ నెల రోజులలో అతను ఇంట్లో వాళ్ళకు చేరువయ్యాడు.